

# ఆకుపచ్చని జ్ఞాపకం

**జీ**వితం అంటే చాలా ఇష్టం జయరామారావుకు. ఆ ఇష్టాన్ని తన నరనరాల్లోనూ జీర్ణించుకుపోయేలా చేసిన మనిషి వాళ్ళ అమ్మ. నిజానికి ఆవిడ అమ్మ కాదు; నాయనమ్మ.

వాళ్ళ నాన్న తన తల్లిని అమ్మా అని పిలుస్తుంటే, అతనిక్కూడా అలా పిలవడమే అలవాటయ్యింది.

వాళ్ళ తాత పేరు అతనికి పెట్టడం వలన చనిపోయిన ఆ ముసలాయన ఆవిడ కళ్ళలో కనిపించేవాడట. అందుకేనేమో అతనిని ప్రాణానికి ప్రాణంగా చూసుకునేది అమ్మ.

ఈశ్వరుడు ఇచ్చిన ఈ మానవ జన్మను సార్ధకం చేసుకోవాలి అనేది. జీవితాన్ని దశలుగా విడదీసి చందమామ కథల్లా చక్కగా చెప్పేది.

ఆమె నేర్పింది గురిగింజంత అయితే, దాన్ని జీర్ణం చేసుకున్న అతను గాలికొండంత పెంచుకున్నాడు తన హృదయంలో. అందుకే అతనంతగా ప్రేమిస్తాడు జీవితాన్ని.

త్వరలో పెళ్ళి కాబోతున్న సమయంలో దాంపత్యం గురించి ఎన్నెన్నో ఊహించు కున్నాడు. అన్నీ తియ్యటి కలలు. తామరాకుల మీద నీటిబొట్లలా నిత్యం కలల్తో కదిలిపోయేది అతని మనసు. ఎన్నెన్నో భావాలు గుండె ఆఖరి గుహలో గునుస్తూ వుండేవి. వాటిని కవితలుగా, కథలుగా రాసేవాడు.

కాకినాడ సంబంధం వచ్చింది. పెళ్ళిచూపులకు వెళ్లే సుదినం ఇక వారం వుందనే లోపే అమ్మ ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయింది.

ఆఖరి రోజుల్లో మాట పడిపోవడం వలన వచ్చీరాని మాటలతో కూడా తన గురించే కలవరించింది. ఆఖరిశ్వాస విడిచేముందు ఆమె అన్న ఆఖరి వాక్యం-

"భార్య భర్తలంటే ఒకళ్ళలో ఒకళ్ళు కలిసిపోవాలి. ఒకళ్ళ ఇష్టాలు ఇంకొకళ్ళు ఇష్టపడుతూ వుండాలి. పిల్ల అందమే కాదు; గుణగణాలు కూడా బాగా చూసి మరీ ఎన్నుకో. నూరేళ్ళ జీవితం నాన్నా!"

కాకినాడలో భానుగుడి అవతల వుంటున్న కాబోయే అత్తారిల్లు చాలా పెద్దది. తమకంటే డబ్బున్నవాళ్ళు. పెళ్ళికూతురు పేరు ఝాన్సీరాణి అట.

షిఫాన్ చీర కట్టుకుని, దించిన తల ఎత్తకుండా కుర్చీలో కూర్చున్న ఝాన్సీని ఇంటర్వ్యూ చేద్దామని ముందుకు వంగబోతుంటే భుజం పట్టుకుని వెనక్కి లాగేసిన తండ్రి....

"అడ్డదిడ్డమైన ప్రశ్నలేసి పిచ్చెక్కించకు.. వాళ్ళు మనకంటే మూడురెట్లు ఆస్థిపరులు. డిగ్రీ చేసిందట పిల్ల. మారుమాటాడకుండా ఒప్పేసుకో" అనేసి తొందరపెట్టెయ్యడంతో సరే అనెయ్యక తప్పలేదు జయ రామారావుకు.

పెళ్ళయిపోయింది.

శోభనం అయిపోయింది.

మనుగడుపు రోజులు పండుగ రోజుల్లా గడిచిపోయాయి.

ఈ మధ్యే పక్షవాతం వచ్చి కింది పెదవి వంకరపోయిన మావగారు-

"ఉజ్జోగం చెయ్యడం ఇష్టం లేదంటున్నావ్. మరేం చేస్తా వల్లుడూ?" అన్నాడు.

"మద్రాసు వెళతాను, మావయ్యగారూ!" అన్నాడు జయరామారావు.

"వెళ్ళి?"

"ఒక గొప్ప పత్రిక పెడతాను. దాన్ని చదివితే ఎందరి జీవితాలో బాగుపడతాయ్ మావగారూ!"

"ఎవరి జీవితాలో సరే. మరి నీ జీవితం సంగతేంటి? లాభాలేవన్నా వస్తాయా?"

"చూస్తారుగా, మావగారూ!"

తన వాటాకొచ్చిన మొత్తం ఆస్తి అమ్మేసిన జయరామారావు భార్యను పుట్టింట్లోనే వుండమని చెప్పి, ఏ సత్యాన్నయితే నమ్మాడో దాన్నే అందరికీ స్పష్టంగా చెప్పాలనే ప్రయత్నంతో పెట్టాడు 'జీవితం' అనే పత్రిక.

బాగానే ఆదరిస్తున్నారు 'జీవితం' కొంటున్న జనం.

లాభం లేకుండా, నష్టమూ రాకుండా ఆ పత్రిక నడపడంతో మరి నమ్మకం కలిగిన తాను మైలావూరు ప్రాంతాల్లోనే ఒక పోర్షను అద్దెకి తీసుకుని ఝాన్సీనీ తీసుకొచ్చి కాపురం పెట్టాడు.

## 2

తెలుగుదేశంలో నాలుగు మూలల్నుంచీ వ్యాసరచన పోటీ కోసం వచ్చిన రాతప్రతుల్ని చదవడంతో లీనం అయిపోతున్న జయరామారావుకు కాలం తెలియడంలేదు.

"ఇందాకట్నించీ పిలుస్తుంటే రారేంటి?" లోపల్నుంచి అరుస్తాంది భార్య ఝాన్సీరాణి.

"ఇదుగో వచ్చేస్తున్నా!" చదువుతూనే జవాబిస్తున్నాడు జయరామారావు.

"గీజర్ ఆన్ చేసి గంటయింది రండీ."

"ఇదిగో వ్యాసాల వడపోత పూర్తయింది ఝాన్సీ."

"ఇవాళ మన మ్యారేజ్ డే. త్వరగా రండి తలంటు పోసుకుందురు గానీ...."

చదువుతున్న వాడల్లా టక్కున ఆపేశాడు.

తలంటు. ఆ మాట వినగానే తలంటుపోసిన అమ్మ రోజులు గుర్తుకొచ్చాయి.

ఇత్తడి గిన్నెలో నానబెట్టిన కుంకుడు కాయల్ని పిసికి కళ్లు మూసుకోమని తన తలమీద తెగరుద్దేది.

అలా రుద్దుతూనే మధ్యలో 'కళ్ళు తెరవకురా నానిగా, పులుసు కళ్ళలో కెళితే మండుతాయ్!, అనేది. కొంటెగా నవ్వి కావాలనే తెరిచేవాడు కళ్లు.

కుయుడురసం కళ్ళలో కెళ్ళడంతో మంటపుట్టి గుక్కపెట్టి ఏడ్చేసేవాడు.

తర్వాత విసుక్కుంటూ పొడి తువ్వాలుతో తల తుడిచి, సాంబ్రాణితో పొగేసి, జుట్టు ఆరబెట్టి, నోటిలో ఉప్పుకల్లు వేసి 'పోయిందా కళ్ళమంట' అనేది.

'ఊఁ!' అనేవాడు.

'వద్దన్న పనే చేస్తావ్ వెధవ సన్యాసీ. కళ్ళు చూడు చింతనిప్పుల్లా ఎలా ఎర్రబడ్డాయో'అని గునుస్తూ పళ్ళని గ్లాస్కో లాల్చీవేసి, పులిగోరు పతకం మెళ్ళోవేసి, ఒళ్ళోకి తీసుకుని తల నిమురుతూ-

"ఈ లాల్చీ వేసుకుంటే అచ్చం మీ తాతగార్లా ఉన్నావ్‌రా. అన్నట్లొరేయ్! రేపు నువ్వు పెద్దాడివయ్యాక పెళ్ళవుద్ది. నామాట విన్నట్లే నీ పెళ్ళాం మాట కూడా విని బుద్ధిగా తలంటు పోయించుకోవాలి. పొరపాటున కళ్ళు గానీ విప్పి ఆ పిల్లని ఇబ్బంది పెట్టావో పొయ్యి ఊదే గొట్టంతో బాదేస్తాన్రోయ్" అంటూ తాయిలం పెట్టేది.

గతాన్ని తల్చుకుంటూ నడుస్తున్నాడు నీళ్ళ గదివేపు.

కింద అంచు తడవకుండా చీర ఒకపక్క బొడ్లోకి దోపుకుని కుయుడుకాయల పులుసు నెత్తిమీద పోస్తుంది ఝాన్సీ. గట్టిగా మూసుకోవాలి కళ్ళు. కాస్త గట్టిగా రుద్దినా విసుక్కోకూడదు అనుకుంటూ బాత్‌రూమ్ దగ్గరకొచ్చి జయరామారావు టక్కున ఆగిపోయాడు.

నైటీ వేసుకుని నిలబడి వున్న ఝాన్సీ-

"త్వరగా కానిచ్చి రండి. కొత్తబట్టలు బెడ్‌మీద ఉన్నాయ్" అనేసి లోపలికి వెళ్ళిపోతుంటే-

"నన్ను బాత్‌రూమ్‌లోకి రమ్మని నువ్వలా వెళ్ళిపోతావేమిటే. తలమీద పులుసెవరు పోస్తారు?" అన్నాడు.

"పులుసెందుకు పొయ్యడం?"

"తలంటుకోవాలి కదా, కుయుడుకాయలు కొట్టి నానబెట్టలేదా?"

"ఆ కొట్టడాలూ, నానబెట్టడాలు బోల్డంత తతంగం బాబూ! సన్‌సిల్క్ షాంపూ వుంది. దాంతో రుద్దేసుకు రండి" అనేసి బాత్‌రూమ్‌లోకి వెళుతున్న ఆమెనే చూస్తూ అనుకున్నాడు ఊహకి, వాస్తవానికీ ఎన్ని క్రోసుల దూరం!

ఫినాయిలు నీళ్ళలో ముంచిన గుడ్డతో నేల తుడుస్తున్న పనిమనిషి కమలమ్మ అక్షరంముక్క చదువుకోలేదుగానీ, అతని చూపుల్ని మాత్రం చదవగలిగింది. బాత్‌రూమ్‌లో కెళ్ళి విసురుగా తలుపేసుకుంటున్న జయరామారావునే చూస్తున్న కమలమ్మకి భర్తయిన టైలర్ వీర్రాజు గుర్తుకు వచ్చాడు.

ఆరోజు భోగిపండుగ గదా అని వాళ్ళుండే పాక వెనుక స్నానాల దడిలో ముక్కాలు పీట మీద కూర్చోబెట్టి జిడ్డుపట్టిన అతని జుట్టు రుద్దుతుంటే, పులుసు కళ్ళలోకి వెళ్ళింది గామోసు అమాంతంగా లేచి చాచిపెట్టి కొట్టాడు.

"తల రుద్దుకోవా?'' కందిన చెంపను తడుముకుంటూ అడిగింది కమలమ్మ.

"అమ్మమ్మల కాలంలోలాగ సున్నిపిండితో నలుగు పెట్టడాలూ, కుయుడుకాయలతో తల రుద్దుకోవడాలూ ఏంటే'' అని అక్కడున్న ఇనుప బాల్చీడు నీళ్ళనీ నెత్తిమీద పోసేసుకుని, కంపుగొట్టే ఆ జుట్టునే బొచ్చు రుమాలుతో తుడిచేసుకుంటూ బయటకొచ్చి-

"ఇయ్యాల గాకపోతే రేపు రుద్దుకుంటానుగానీ, కిరాణా కొట్టులో కొంటావో, నువ్వు పనిచేసే వాళ్ళింట్లో కన్నమేస్తావో నాకు తెల్దు. రేపు ఈపాటికి ఆ షాంపూ, సీసాకాయి పట్టుకొచ్చి రుద్దకపోయావో నీ మెడకాయ్ నరికెయ్యాల్సొస్తది'' అనెళ్ళిపోయాడు.

గతం తలుచుకుని వర్తమానంలోకి వచ్చిన కమలమ్మ ఆ మాటలకి నవ్వుకుంది.

లోపలికెళ్ళిన గంట తర్వాత తల తుడుచుకుంటూ బాత్‌రూమ్‌లోంచి బయటకొచ్చిన జయరామారావు బెడ్‌రూమ్‌లోకి వెళ్ళబోతూ బయట గోడకున్న పటాన్ని చూసి ఆగిపోయా డొక్కసారి.

పెద్ద బొట్టు పెట్టుకుని, పొడుగాటి జడ వేసుకుని నిలబడ్డ 'బాపు' బొమ్మ- ప్రారంభ సంచిక కోసం అడిగితే గీసిచ్చారాయన.

కవర్ పేజీ ప్రింటయ్యాక ప్రెస్‌లోంచి తెచ్చిన ఆ డ్రాయింగుని పటం కట్టించి తగిలించాడీ గోడకి.

ఇప్పటికి ఎన్ని వేలసార్లు చూసుంటాడో ఆ బొమ్మని.

చింతామణి వేషం వేసే బుర్రా సుబ్రహ్మణ్యంగారు చీర కట్టినట్లు ఆంధ్రదేశంలో ఏ ఆడదీ కట్టలేదంటాడు.

బాపు తన బొమ్మకి జడ అల్లినట్లు ఆంధ్రదేశంలోనే కాదు; ఈ తమిళదేశంలో కూడా ఏ ఆడపిల్లా అల్లుకోలేదని తన అభిప్రాయం.

'ఝూన్సీరాణి ఈ బొమ్మలో అమ్మాయిలా జడ వేసుకుంటే చూడాలని వుంది. ఇవ్వాళ పెళ్ళిరోజు కదా! తన చిరకాల వాంఛ తీర్చమని అడిగేద్దాం' అనుకుంటూ బెడ్‌రూమ్‌లోకి వచ్చిన అతను అవాక్కయి నిలబడి పోయాడు.

పొడుగాటి జుట్టును మూడొంతులకి పైగా కట్ చేసేసి, పిలకలా వున్న దాని చివర ఎర్రటి ఉలెన్ రబ్బర్ బేండ్ బిగించుకుని వుంది.

విప్పిన కనురెప్పల్ని మరి ముయ్యకుండా చూస్తున్న జయరామారావుతో-

"అలా చూస్తారేంటి? పోనీటైల్ అంటారు దీన్ని... బాగుందా?" అంది ఝాన్సీ.

"బాగుందో, లేదో తర్వాత చెప్తాగానీ నేను బాత్‌రూమ్‌లో కెళ్ళొచ్చే లోపల అర్జంటుగా నీ జుట్టు కత్తిరించినవా డెవరూ?"

"మగవాడు కాదండీ. మన పక్కింటి రమా శివరామ్‌గారు. వాళ్ళ ఇంట్లోనే బ్యూటీ పార్లర్ పెట్టింది. మోడ్రన్‌గా హెయిర్‌స్టయిల్ చేసి హెన్నా పెడతాను రండీ అని మొన్నట్నుంచీ పోరుతుంటే, మా మారేజ్ డేన వస్తాన్లెండి అన్నాను. ఏవండీ! నా జుట్టుకి హెన్నా పెట్టించుకోనా, ఇన్‌స్టాంట్ బ్లీచ్ వేయించుకోనా?"

ఉత్కంఠతో ఆమె వేసిన ప్రశ్నకి ఎలాంటి జవాబూ ఇవ్వకుండా డైనింగ్ టేబుల్ వైపేళ్తూ అనుకున్నాడు-

"నా ఊహల్లో జీవితం ఊహగానే మిగిలిపోతోంది. అనుభవంలోకి ఎప్పుడొస్తుందో?"

ఇడ్లీల పళ్ళెం, పెరుగు కలిపిన కొబ్బరి పచ్చడి టేబుల్‌మీద పెడుతున్న కమలమ్మ చెవిన పడ్డాయా మాటలు.

అయ్యగారిలాగే తనకీ పొడుగాటి జడ వేసుకోవడమంటే ఎంతో ఇష్టం.

జడకుప్పెలు పెట్టుకోవడమంటే మరీ ఇష్టం.

ఒకరోజు సాయంత్రం తెల్లటి వాయిల్‌చీర కట్టుకుని, రాజమండ్రి జాలీ ఫేస్ పౌడర్ ముఖానికి పూసుకుని, చక్కటి సువాసనొచ్చే సంపెంగ నూనె తలకి రాసుకుని, పొడుగ్గా జడ వేసుకుని పొద్దుపోయేదాకా ఎదురు చూసింది వీర్రాజు కోసం,

రాత్రి రెండో ఆట విడిచిపెట్టే టైము కనుకుంటాను తెగతాగిన వీర్రాజు తూలు కుంటూ వచ్చాడు.

పెట్టిన అన్నం కంచం కళ్ళంచేసి తిని, పక్కలోకి జేరి కమలమ్మని తమకంతో కౌగిలించుకు పడుకున్నప్పుడు అడిగాడు-

"తలకేం రాసేవే వాసన అదిరిపోతాంది!"

"నిమ్మనూని-బాగుందా సువాసన? సంబరంగా అడిగింది కమలమ్మ.

"చాలా బాగుందిగానీ, ఈ నూని నిన్నకూడా రాసేవుగదూ?" అడిగాడు.

"నిన్నేటి, వారంనించీ రాస్తూనే వున్నాను గదా?"

విసురుగా మంచంమీంచి లేచిన వీర్రాజు తన గిరిజాల జుట్టుని చేతి గోళ్ళతో గోక్కుంటూ-

"ఇప్పుడర్థమయింది. పేను అంటే ఏంటో ఎరగని నా అందమైన జుట్టులోంచి పొద్దున నాలుగు పేలు ఎందుకు రాలినియ్యో ఇప్పుడర్థమయిందే" అన్నాడు.

ఏమాత్రం అర్థంకాలేదు కమలమ్మకి.

"నేను రాసుకున్న నూనికి-నీ తల్లో పేలకీ సంబంధమేమిటి?" అని అడిగింది కమలమ్మ.

"అక్రమ సంబంధం. ఇంకో నాలుగురోజులు ఈ సంపెంగ నూని రాసుకుని నా పక్కలో పడుకుంటే పేలతో పుచ్చిపోద్ది నా తలకాయ" అన్నాడు వీర్రాజు.

"నాకా సంగతి తెల్దు. ఇంకెప్పుడూ రాయన్లే!"

"నూని ఆ సీసాకాయిలో వున్నంతసేపూ నీ మనసు ఆ పక్కనే మళ్ళుద్ది. నువ్వింక రాయకుండా వుండాలంటే ఒకటే మార్గం" అంటూ తూలుకుంటూ తడికవతలకెళ్ళి మిషను కత్తెరతో వచ్చిన వీర్రాజు ఆమె జుట్టును కుత్తుకలోకి కత్తిరించేశాడు.

★★★

పాతికవేల సర్క్యులేషన్‌తో నడుస్తున్న జయరామారావు 'జీవితం' వున్నట్టుండి పదివేలకు పడిపోయింది.

ఎప్పుడూ లేంది ఇదేమిటని ఏజంట్ల నడిగితే, టీవీ ఛానెల్స్ పెరిగి పోయాయి. వాటికి అంటుకుపోతున్న జనం పత్రికలూ, నవలలూ కొనడం మానేస్తున్నారు.

పత్రిక రేటుగానీ మీరు కాస్త తగ్గిస్తే ఇంకో వెయ్యి కాపీలు ఎక్కువ అమ్మగలం అనడంతో చాలా టెన్షన్‌లో పడిపోయాడు జయరామారావు.

ఎప్పుడూ లేని ఒకరకమైన వింత భయం ఆవహించేసింది అతన్ని.

ఎప్పుడూ ఎదుర్కోని పరిస్థితికి గురి కాల్సొస్తుందేమో అన్న శంక మొదలయింది.

ఏం చెయ్యాలో తోచడంలేదు.

కొన్ని గంటలసేపు తన రూమంతా కలయ తిరిగాక గుర్తుకొచ్చింది భార్య ఝాన్సీరాణి.

చదువుకున్న మనిషి తాను.

కొన్ని విషయాల్లో తనకంటే తెలివైనది.

సమస్య ఆమెకు చెప్పి చర్చిస్తే సుదీర్ఘమైన ఆ చర్చలోంచి తరణోపాయం ఒకటి తప్పకుండా వస్తుంది.

ఫోన్ దగ్గరకెళ్ళి వెంటనే ఇంటికొస్తున్నానని చెప్పేసి బయలుదేరాడు.

ఆ మధ్యాహ్నం పూటనించి నవ్వొచ్చే కామెడీ సినిమా ఒకటి వస్తుంది టీవీలో.

బ్యూటీ పార్లర్ రమా శివరామ్, పక్కింటి విజయా దీనదయాళ్, పక్కవీధిలో శోభాశంకర్, ప్రభా పార్థసారథి దర్జాగా కూర్చుని వున్నారు సోఫాల్లో. వాళ్ళ మధ్య కూర్చున్న ఝాన్సీ రెచ్చిపోతూ తిలకిస్తూంది కామెడీ సినిమాని. అందరికీ మూడోసారి కాఫీలందిస్తూంది కమలమ్మ.

చాలా ఫాస్ట్‌గా లోపలికొస్తున్న జయరామారావుని చూసిన టీవీ ముందు ఆడాళ్ళంతా లేవబోతుంటే, "పర్లేదు కూర్చోండి. ఆయన లోపలి కెళతారు" అంది ఝాన్సీ. తలొంచుకుని లోపలి కెళ్ళబోతున్న అతనితో- "క్లైమాక్స్‌లో కొచ్చేసింది సినిమా. వచ్చేస్తున్నా నుండండి" అనేసి మళ్ళీ సినిమాలో లీనమయిపోయింది. తానెంతో ముఖ్యమైన విషయం.....కాదు, తన భవిష్యత్తు గురించి మాట్లాడదామని ఫోన్‌చేసి మరీ వస్తే, తనకోసం వెయిట్ చెయ్యడం మానేసి టీవీ చూస్తోంది. గొణుక్కుంటూ కాళ్ళుగాలిన పిల్లిలా కలయతిరుగుతున్నాడు గదంతా.

పావుగంటయింది.

గదిలోకి రాలేదు ఝాన్సీ.

అరగంటయింది.

రాలేదు ఝాన్సీరాణి.

గంటయింది. రెండు గంటలైంది. రెండున్నర గంటలైంది.

ఇంకా రాలేదామె.

ఎంతో సాత్వికుడయిన జయరామారావులో, శ్రీరాముడికంటే శాంతమూర్తి అయిన జయరామారావులో సహనం సర్వం చచ్చిపోయింది. వెళ్ళి ఆ టీవీని ముక్కలు చేసేద్దామన్నంత ఆవేశం. దాన్ని తిలకిస్తున్న అందమైన ఆ ఆడాళ్ళ కళ్ళని కైజారుతో కసుక్కున పొడిచి పారేద్దామన్నంత కసి. ఖడ్గంతో కండలుగా చీల్చి రాబందులకి విందు చేద్దామన్నంత కసి.

మూడుగంటలు గడిచాక "ఏమిటండీ మాట్లాడాలన్నారు?" అంటూ తాపీగా లోనికొచ్చిన ఝాన్సీరాణిని చూసి కోపం కంట్రోల్ చేసుకోవడానికి ప్రయత్నం చేస్తూనే అన్నాడు-

"ఇప్పుడే వస్తానని చెప్పి ఇంతసేపా?"

"క్లైమాక్స్ అయిపోయినా కదల్లేదండీ వాళ్ళు."

"మన కథ క్లైయిమాక్స్ కొచ్చింది."

"కొత్త కథ రాశారా?"

"నేను కాదు; ఆ దేవుడు రాశాడు మన నుదుటిమీద."

"మీరేం మాట్లాడుతున్నారో ఒక్క ముక్క అర్థమయి చావడం లేదు బాబూ."

"అవతల కొంపలంటుకు పోతుంటే ఏం జరిగిందని తాపీగా అడుగుతావా? మాట్లాడాలని ఫోన్‌చేసి మరీ వస్తే ఇంత నిర్లక్ష్యమా? ఎప్పుడూ ఫోన్ చెయ్యని మొగుడు ఇంత అవసరపడుతూ వస్తే దానికి నువ్వు కదిలే విధానం ఇదా?"

"ఎప్పుడోగాని రానివాళ్ళంతా చెప్పాపెట్టకుండా దిగిపోయారు. మాట్లాడుకోవాల్సింది మనిద్దరమేగదా. చెప్పండి విషయమేమిటో?"

"ఏమిటా- మీరు చూస్తున్న టీవీల పుణ్యమా అని ఎప్పుడూ పాతికవేల కాపీలు ప్రింట్‌చేసే మన పత్రిక పదివేలకి పడిపోయింది. ఇలాగ్గానీ ఇంకో రెండు నెలలు గడిస్తే ఇక మూసెయ్యాల్సిందే."

"మూసెయ్యండి."

"అప్పుడు మనం తినాల్సింది ఫుడ్ కాదు గడ్డి".

కర్కశంగా అతని నోట్లోంచి పలికిన ఆ మాటలు కర్ణకఠోరంగా వినిపించాయి ఆమె చెవులకి. గులాబీ రంగులో వుండే ఆమె ముఖం ఆరిపోయిన రాక్షసిబొగ్గులా మారిపోయింది. నులివెచ్చగా విడిచే ఆమె ఊపిరిలో వడగాల్పులు మిళితమయ్యాయి. ఆవేశంగా అతని ముందుకొచ్చి "ఏమన్నారు" అంది.

"ఇక పనుండదుగాబట్టి ఫుడ్డుకి బదులు గడ్డి తినాలి మనం అంటున్నాను."

"అదేదో మీరే తినండి. గడ్డి తినాల్సిన ఖర్మ నాకు పట్టలేదు. ప్రాణంగా చూసుకునే మా పుట్టింటివాళ్ళుండగా నాకేం ఖర్మ." భోగిమంటలా మొదలయిన మంట మొన్నటి పాశర్లపూడి బ్లో అవుట్ అంత ఎత్తు ఎదిగింది ఘర్షణ. గంటసేపు సాగాక ఇక మనం కాపురం చెయ్యడం కల్ల అన్న నిర్ణయానికొచ్చేసింది ఝాన్సీరాణి.

సూట్‌కేస్‌లో బట్టలు సర్దుకుని, వాటర్ బాటిల్‌లో నీళ్ళు పోసుకుని కాకినాడలో వున్న వాళ్ళ పుట్టింటివాళ్ళకి ఫోన్‌చేసి, "నే నీ సాయంత్రం సర్కార్ ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరుతున్నాను. వెంటనే విడాకులు ఏర్పాటు చెయ్యండి" అనేసి పెద్ద శబ్దం వచ్చేలాగా రిసీవర్ క్రెడిల్ చేసి, కమలమ్మతో ఆటో తెప్పించుకుని గంటకి నూటయాభై మైళ్ళు వీచే తుఫాను గాలికంటే వేగంగా వెళ్ళిపోయిం దక్కడ్నుంచి.

దాదాపు ఇలాంటి సంఘటనే కమలమ్మ జీవితంలో కూడా జరిగింది. ఆమె భర్త ఆ నగరంలో బాగా డబ్బున్న పెద్దకుటుంబంలో అందరి బట్టలూ కుడుతూ, వాళ్ళతో వీడెవడో బాగానే కుడుతున్నారు అనిపించుకుని, "తమ ఇంటి బట్టలు కుట్టుకుంటే చాలండి. మా పొట్ట గడిచిపోద్ది. తమ కారుషెడ్లో నా మిషను పెట్టుకోనివ్వండి" అని ఆ ఇంట్లో ఆడాళ్ళని బతిమలాడి వాళ్ళ ద్వారా మగాళ్ళని ఒప్పించేలా చేశాడు.

కొన్నాళ్ళు బాగానే గడిచాక ఆ పెద్ద కుటుంబంలో భర్తపోయిన ఒకావిడతో సంబంధం ఏర్పడింది వీర్రాజుకి. ఆ విషయం ఇంటివాళ్ళకి తెలిసిపోయింది. కారులో తరమడం మొదలెట్టారు వీర్రాజుని. తెలివిగా తప్పించుకుని ఇంటికొచ్చేశాడు. కంగారుపడుతున్న వీర్రాజు దగ్గరకొచ్చిన కమలమ్మ అడిగింది. "ఏంటలా వున్నావ్? ఏమైంది?"

"ఏమీ అవలేదు. నోర్మూసుకు పడుకో." కసిరేడు వీర్రాజు.

"నీ మొఖం చూస్తుంటే ఏదో చిక్కుల్లో వున్నట్లనిపిస్తుంది. విషయం ఏంటో చెపితే నాకు తోచింది నేను చెప్తానుగదా. నీతో కలిసి బతుకుతున్నాను. నీ కష్టాల్లో నేను పాలు పంచుకోకూడదా?"

"పాలు పంచుకోనక్కర్లేదు. సారా పంచుకోనక్కర్లేదు. ఎళ్ళి పడుకోవే." అరిచాడు. కానీ గుండెల్లో దడ పెరిగిపోతోంది. 'ఏం చెయ్యాలి? కాస్త ధైర్యం రావాలంటే ఏం చెయ్యాలి? ఆఁ....! మందు వెయ్యాలి. అదిగానీ పడితే ముందు ధైర్యం వస్తది. తర్వాత ఎవడొచ్చినా ఎదిరించగల బలమొస్తది' అనుకుంటూ ఆ చీకట్లో సారాకొట్టు వైపెళ్ళిన వీర్రాజు ఎంతసేపు గడిచినా రాలేదు ఇంటికి.

మర్నాడు ఉదయం మద్రాసు పెరంబూర్ అవుటర్ సిగ్నల్ అవతల ముక్కలు ముక్కలుగా కనిపించింది అతని శవం.

★★★

సాయంత్రం అయిదుగంటలింకా దాటలేదు. పనంతా పూర్తిచేసి కమలమ్మకు తాను ఇంటికి బయల్దేరే టైమయ్యేసరికి వెళ్ళిపోయింది.

ఆ ఇంటి డాబామీద ఒంటరిగా కలయతిరుగాడుతున్న జయరామారావు మెదడులో ఫిరంగులు మోగుతున్నాయి. గండశిలలు బద్దలవుతున్నాయి. అతని ఆలోచనలు వెళ్ళిపోయిన భార్య గురించి కాదు. దిగజారిపోయిన తన పత్రిక సర్క్యులేషన్ ఎలా పెంచాలా అని.

రూపాయి పాపాయి కాదు. మూడు లక్షల రూపాయలు. ఎవడిస్తాడంత డబ్బు? పొద్దుటే ఒక మార్వాడీని అడిగితే పదిహేను రూపాయల వడ్డీ- ప్రతినెలా యాభై అయిదువేలు కట్టాలట. ముందే ఆ యాభై వేలకు సంతకాలు చేసిన చెక్కులు కావాలట. చెక్కుమీద వేసిన డేటుకి ఒక్కరోజు ఆలస్యమయితే చాలా ప్రమాదాలు సంభవిస్తాయట. ఈ పెంటంతా ఎందుకని టి.ఎన్.ఎస్.సి., ఎగ్మూర్ బెనిఫిట్ సొసైటీ బ్యాంక్ వాళ్ళని కాంటాక్ట్ చేస్తే, ప్రెస్ అంతా పరిశీలించిన వాళ్ళు మోడ్రన్ ఆఫ్‌సెట్ మెషినరీ వుంటే తప్ప, ఇలాంటి పాతకాలం ట్రెడిల్ మెషిన్లకి లోను ఇవ్వమన్నారు.

"ఎలా? ఎలా తేవాలి?"

ఆలోచనలు సాగుతుండగా ఫోన్ మోగిన శబ్దమై కిందికి పరుగెత్తాడు.

"హలో అల్లుడుగారా?"

అవతలినుంచి నత్తిగా వినిపిస్తోంది మావగారి మాట.

"అవును, మావగారూ!" అన్నాడు జయరామారావు.

"ఏం, నాయనా, క్షేమమేనా?"

"బానే వున్నాన్లెండి!"

"ఆరోగ్యం ఈ మధ్య బాగా పాడయిపోయింది, నాయనా. ఇప్పుడు పర్లేదనుకో" అంటుండగా ఆయన దగ్గర్నుంచి ఫోన్ లాక్కున్న రెండో బావమరిది క్షణంలో క్షేమసమాచారా లడిగి మెయిన్ పాయింట్ కొచ్చేసి, "ఈ పూట సర్కారుకు బయల్దేరిందటగా మా సిస్టరూ" అనడిగాడు.

"బయల్దేరిందేమో" అన్నాడు జయరామారావు.

అతని జవాబులోని శ్లేషని గమనించిన చిన్న బావమరిది అసలేం జరిగిందన్నాడు. తు.చ. తప్పకుండా జరిగిందంతా చెప్పిన జయరామారావు మూడు లక్షలెలా సంపాదించాలా అన్న విషయంమీద తనతో చర్చించాలని ఇంటికొస్తే, తానలా చేయడం న్యాయమా అనేసరికి, అరక్షణం ఆలోచనలో పడ్డ బావమరిది, "మీరడిగిన డబ్బు చాలా తక్కువ వడ్డీకి అర్జంటుగా నే నిప్పిస్తానుగానీ, అది మర్చిపోయి తక్కిన పనులు చూడండి" అని కాస్త గ్యాప్ యిచ్చి, "ఎలానూ వచ్చింది కాబట్టి రెండు రోజులుంటుంది. డబ్బు ఇవ్వడానికొస్తానుగదా, నాతోపాటు తీసుకొస్తాను" అన్నాడు.

"అదికాదు బావా! నా అభిరుచి వేరు, మీ చెల్లెలి అభిరుచి వేరు. యిద్దరికి రోజా గొడవలే."

"ఒకే ఒక చెల్లెలని ముద్దుగా పెంచాం. పెళ్ళయ్యాకా ఇలా వుండాలని చాలా చెప్పి చూశాం. తిక్కమనిషి-ఎలాగో సర్దుకోండి మరి" అన్నాడు రెండో బామ్మర్ది.

పెద్ద బావమరిది, అత్తగారూ కూడా మాట్లాడి మామూలు స్థితికి తీసుకొచ్చారు జయరామారావును. "మీ క్కావల్సిన ఆ మూడు లక్షలూ మీ చేతుల్లో ఉన్నట్లే అనుకుని సమస్యలన్నీ మర్చిపోయి మరి పనుల్లోకి దిగండి" అన్నారు ముక్తకంఠంతో.

మూడులక్షలు-తన పత్రిక పబ్లిసిటీ చేయడానికి కావల్సిన మూడులక్షలూ దొరికేశాయి. ఇక పత్రిక బతికి బట్టకట్టినట్టే! తన జీవితం ఇక జీవించినట్లే. బావమరుదులిచ్చే ఆ డబ్బుతో పడిపోతున్న తన పత్రికని పెంచడం ఎలా? పబ్లిసిటీ చేయడానికి ఎలాంటి స్కీములెయ్యాలి. డెవలప్ చేయడానికి ఇంకా ఏం చెయ్యాలి?

"భార్యల అలకలు తీర్చడం ఎలా?"

"భర్తల కోపం పోగొట్టడానికి చిట్టి చిట్కాలు."

"మగవాళ్ళలో మగువలు మెచ్చని అంశాలు."

"స్త్రీలు స్లిమ్‌గా మారడానికి 20 సూత్రాలు."

పాఠకుల్ని ఆకట్టుకునే కొత్త శీర్షికల్ని కాగితంమీద రాసుకోడం పూర్తి చేసేసరికి చాలా రాత్రయింది. సాయంత్రం ఎప్పుడో కమలమ్మ వండి డైనింగ్ టేబుల్‌మీద పెట్టి వెళ్ళిన గిన్నెలో కూరలూ, అన్నం కలగాపులగం చేసుకు తినేసి హాల్లో మూల నిలబెట్టి ఉన్న పరుపుచుట్ట నెత్తి మీద పెట్టుకుని డాబామీది కెళ్ళాడు.

గాఢంగా నిద్రపోతోంది నగరం. అద్భుతంగా వీస్తోంది గాలి. చక్కని కాంతిని ప్రసారం చేస్తున్నాడు వెండి చంద్రుడు.

మూడు లక్షలు ఖర్చుపెట్టి పబ్లిసిటీ ఇచ్చి కొత్త కొత్త శీర్షికల్తో మార్కెట్లోకి పంపబోయే తన పత్రికని ఇంటిల్లిపాదీ చదువుకుంటారు. సత్యభామల్లాంటి భార్యల అలకలు తీర్చడమెలాగో తెలుసుకుంటారు భర్తలు.

కోపిష్ఠి భర్తల్ని ఎలా సముదాయించాలో తానిచ్చే చిట్కాల ద్వారా నేర్చుకుంటారు భార్యలు. మగవాళ్ళలో మగువలు మెచ్చనవి, మగువల్లో మగవాళ్ళు మెచ్చని అంశాల్ని గుర్తిస్తారు. అన్నీగాకపోయినా కనీసం కొన్ని కుటుంబాల్లోనన్నా సుఖశాంతులు ఏర్పడతాయి తన పత్రిక ద్వారా....

కానీ....కానీ, తన కుటుంబం సంగతేమిటి?

తన భార్య ఝాన్సీ ఎప్పటికీ మారదు. తన అభిరుచులకు అనుగుణంగా ఈ జన్మకు నడుచుకోదు సరిగదా; తన ఇంటినుంచి డబ్బు తెప్పించుకుని వ్యాపారం నడుపుతున్నందుకు సూటిపోటి మాటల్తో గిచ్చడం కూడా మొదలెడ్తుంది రేపట్నుంచి.

నలుగురి బాగుకోసం ఆలోచించే తన జీవితం ఇలా రసంలేని చెరుగ్గడలా సాగడం అన్యాయం అనిపించింది. తన అభిరుచులకూ, ఇష్టాలకూ అనుగుణంగా తన బతుకు సాగాలంటే ఏం చెయ్యాలి మరి? ఎంత ఆలోచించినా ఎంతకీ తెగడంలేదు. ఒక కొలిక్కి రావడంలేదు.

చాలాసేపు గడిచింది. చివరికో నిర్ణయానికొచ్చాడు.

పోన్లే జీవితమంతా వద్దు. కనీసం జీవితంలో ఒక్కరోజన్నా తాను కోరుకున్నట్టు గడవాలి. తన భార్య ఊర్నుండి వచ్చాక ఒకరోజు తనకిష్టమైన విధంగా గడపమని కోరితే?

ఊహూఁ! తనకు పూర్తిగా విభిన్నమైన తత్త్వంగల ఝాన్సీ ఒప్పుకోదు. పొరపాటున ఒప్పుకున్నా ఆ ఒక్కరోజు జీవితంలో కృత్రిమత్వం తప్ప జీవం వుండదు. మరేం చేయాలి?

ఆలోచించగా ఎప్పటికో తట్టింది ఒక ఆలోచన.

కమలమ్మని అడిగిచూస్తే?

కరెక్ట్! చాలా కరెక్ట్! తన మనస్తత్వమేమిటో, తాను కోరుకునేది ఏమిటో స్పష్టంగా ఎరిగిన మనిషి కమలమ్మ. ఆ ఒక్కరోజు జీవితం గడపడానికి కమలమ్మే కరెక్టయిన మనిషి. కానీ...

సంప్రదించడం ఎలాగ? ఎలాగేంటి. అంతా చెప్పి ఒకే ఒక్కరోజు తనకు భార్యగా జీవితం ఇమ్మని అడుగుదాం. ఇష్టమైతే సరే అంటుంది. కష్టమైతే పొమ్మంటుంది. అంతే- అనుకున్న జయరామారావు మర్నాడు పొద్దుట పన్లోకొచ్చిన కమలమ్మకు క్లుప్తంగా తన కథంతా చెప్పి, తన కోరికని తీర్చమనేసరికి గజగజా వణకి పోయిం దామె.

"శారీరక సుఖంతప్ప సర్వం కావాలి, కమలమ్మా! ఒకే ఒక్కరోజు. ఇవాళ శనివారం. రేపు ఆదివారం-వీలైతే రేపు ఉదయం ఆరు గంటల్నుంచి సాయంత్రం ఆరు గంటలవరకే."

మాట్లాడలేదు కమలమ్మ.

"ఆదివారం పొద్దుట ఐదు గంటలకే వచ్చి ఆ బీరువాలో ఉన్న ఝూన్సీ పట్టుచీర కట్టుకుని నన్ను నిద్రలేపాలి. నిన్ను ఏమోయ్ అనో, ఏవేఁ అనో పిలుస్తాను. బాబుగారూ, అయ్యగారూ అంటూ నాకు మర్యాద లివ్వక్కుర్డా, ఇదిగో ఏవండీ.... అని మాత్రమే పిలవాలి" అని ఇంకా ఏదో చెప్పేలోపే విసురుగా అక్కడ్నించి వెళ్ళిపోయింది కమలమ్మ.

అలా వెళ్ళిన మనిషి మళ్ళీ తిరిగిరాలేదు. ఆత్మాభిమానం గలది కమలమ్మ. ఇన్నాళ్ళనించి పనిచేస్తున్నా ఒకనాడూ కన్నెత్తి చూడలేదు. పలకరించిన గుర్తుకూడా లేదు. పాపం, ఆ మనిషి మనసు నొప్పించినట్లున్నాను. ఆఫీస్‌కెళ్ళి మధ్యాహ్నం హోటల్లోనే భోజనం చేసి రాత్రెప్పుడో ఇంటికివచ్చి ఎప్పటికో నిద్రపోయాడు.

## 3

ఆదివారం-ఉదయం ఆరుగంటలయింది. గాఢంగా నిద్రపోతున్న జయరామారావు ఉలిక్కిపడి లేచాడు. కాళ్ళు తడుతూ తనని మేల్కొలుపుతోంది కమలమ్మ. అప్పుడే తలస్నానం చేసినట్టుంది. తుండుగుడ్డతో పిడచ కట్టుకుని, రూపాయి బిళ్లంత కుంకుమ బొట్టు పెట్టుకుని, బీరువాలో ఉన్న తన భార్య పట్టుచీర కట్టుకుని, నవ్వుతూ నిలబడ్డ కమలమ్మ- "లేచెళ్ళి ముఖం కడుక్కొరండి. కాఫీ చల్లారిపోతూంది" అని అంటుంటే అవాక్కయి నిలబడిపోయాడు. ఆ చల్లనివేళ రూపం దాల్చిన తన ఊహకి ఉబ్బితబ్బిబ్బయి పరుగెత్తాడు బాత్రూమ్‌లోకి.

స్నానం చేసొచ్చి డైనింగ్ టేబుల్‌ముందు కూర్చోగానే వేడి వేడి పెసరట్ల పళ్ళెంతో ప్రత్యక్షమైంది. తినడం పూర్తికాగానే ఒక గ్లాసుతో వచ్చి- "పెసరట్లు తిన్నారుగా, వేడి చేస్తుంది. కాఫీ తాక్కండి-ఉప్పేసి నిమ్మకాయ పిండాను తాగండి" అని అందించింది మజ్జిగ గ్లాసు.

తన జీవితంలో ఎన్నో పండుగలు చూశాడు కానీ, నిజమైన పండుగ రోజు ఇదే! అసలు సిసలైన పర్వదినం ఇదే-ఇదే అనుకుంటూ మజ్జిగ తాగేసి స్టడీ రూమ్‌లో కెళ్ళి పోయాడు. ఒక గంటసేపు సీరియస్‌గా రాసుకోవడం అయ్యాక కాస్త అలసటగా కళ్ళు మూసుకుని కుర్చీ వెనక్కి జారబడుతున్న సమయంలో అక్కడికి వచ్చిన కమలమ్మ నిశ్శబ్దంగా నిలబడింది.

"ఏవిటోయ్?" అడిగాడు.

'రెండు మూడుసార్లొచ్చి తొంగి చూశాను. రాసుకుంటున్న మనిషిని విసిగించ కూడదని వెళ్ళిపోయాను. ఇప్పు డడగొచ్చా?" అంది.

"ఏమిటి?"

"మధ్యాహ్నం వంటేం చేయమంటారు?"

"నీ ఇష్టం."

"మీ ఇష్టమే నా ఇష్టం-చెప్పండి."

నవ్వేసిన అతను- "నువ్వేం వండినా ఇష్టమే నాకు. వెళ్ళి కానియ్" అన్నాడు.

"మీ కిష్టమైన పనసపొట్టు కూర చెయ్యమంటారా! గుత్తి వంకాయ కూడా వండుతాన్లెండి."

తనకు ఎంతో ఇష్టమైన కూరల్ని ఎంత సూక్ష్మంగా గ్రహించింది అని సంబరపడి పోయిన జయరామారావు 'అలాగే' అనడంతో అక్కడ్నించి వెళ్ళిపోయిం దామె. మళ్ళీ రాసుకునే పనిలోపడ్డాడు. కాసేపటికి వంటింట్లో చేస్తున్న వంటల తాలూకు గుమగుమలు అతని ముక్కుని తాకుతున్నాయి.

"ఏమిటోయ్ వాసనలు బాగానే వస్తున్నాయ్. వంటలెలా ఉంటాయో!"

ఆమెకి వినిపించేలా అరిచాడు.

"నాకు చేతనైంది చేస్తున్నాను. నచ్చకపోతే ఆనక నన్ను తిట్టొద్దు బాబూ" లోపల్నుంచి అతనికి వినిపించేలాగే జవాబిచ్చింది.

"నచ్చకపోతే తిట్టనూ....అయినా, తినడం మాననులేగానీ, కాస్త కాఫీ పట్రా" అని మళ్ళీ పన్లోపడ్డ కాస్సేపటికి మంచినీళ్ళూ, వేడి కాఫీ గ్లాసుతో అతని ముందుకివచ్చింది కమలమ్మ.

మధ్యాహ్నం వేడి అన్నంలో పనసపొట్టు కూర వడ్డించింది. కలుపుకుని ముద్ద నోట్లో పెట్టుకున్న జయరామారావుకు అకస్మాత్తుగా గుర్తుకు వచ్చింది వాళ్ళమ్మ. అచ్చంగా అదే రుచి. వాళ్ళమ్మ కూడా ఇలాగే ఆవపెట్టి వండేది. మళ్ళీ ఎన్నాళ్ళకి తింటున్నాడు. ఆవురావురుమంటూ తినేస్తున్న వాడల్లా ఒక్కసారాగి. "మరి నువ్వుకూడా వడ్డించుకోవోయ్" అన్నాడు.

"మీదయ్యాక తింటాన్లెండి." గుత్తివంకాయ వడ్డించింది.

ఆ కూర కూడా కలుపుకుని తింటూ - "అమోఘం, అద్భుతంగా వండావు" అని అరిచాడు.

'కూర బావోలేదని దెప్పిపొడుస్తున్నారా?"

"అద్భుతంగా వుందని పొగుడుతున్నానే, ఇదిగో ఓ ముద్ద తిని చూడు" అంటూ వద్దంటున్నా ఆమె నోట్లో పెట్టేసి, "ఎలాగుంది రుచి?" అన్నాడు.

సిగ్గుపడుతూ అంది- "బాగుంది."

"బాగుంది కాదు, చాలా బాగుంది అను."

"ఈ రుచి నేను వండడంవల్ల రాలేదు. వంకాయలు మంచివి దొరకడం వల్లొచ్చింది లెండి" అంటూ పప్పుపులుసు వేసింది.

దాన్ని రుచిచూసిన జయరామారావు దోర్చేస్తూ కంచం మొత్తం ఖాళీచేసేశాడు. చిన్నప్పుడెప్పుడో వాళ్ళ వూళ్ళో తిన్న వంట మళ్ళీ ఇన్నాళ్ళకు కడుపారా తిని, వాష్‌బేసిన్ దగ్గర చెయ్యి కడుక్కుంటూ వెనక్కి తిరిగి చూస్తే కంచంలో పడ్డించుకుంటోంది కమలమ్మ.

అమితానందంతో ఆమెకేసే చూస్తూ బెడ్‌రూమ్‌వైపు నడుస్తుంటే "ఏవండీ" అంది.

"ఏమిటీ" అని అడిగాడు.

"అప్పుడే పరుపెక్కెయ్యకండి. తాంబూలం తెస్తాను. వేసుకున్నాకా తీద్దురుగాని కునుకు."

"అలాగేలేవోయ్."

కమ్మని సుగంధాల్ని కలిపి చేసిన పుత్తూరు వక్కపొడి అతని అరచేతిలో వేసి, వేళ్ళకి చుట్టిన తమలపాకు చిలకల్ని అందిస్తుంటే ఒక్కోవేలూ మెత్తగా కొరుకుతూ తాంబూలం సేవిస్తున్న జయరామారావు, "ఇందాకట్నుంచి అనుకుంటున్న మనసులో మాట చెప్పనా. ఈరోజు నాకు పండుగలాగుందోయ్" అన్నాడు.

"నాక్కూడా" అందామె.

"పండుగలాగే వుంది కదూ?"

"కాదు- పెద్ద పండుగలాగుందండీ."

"ఈ జన్మకి ఈ ఒక్కరోజు చాలనిపిస్తోందోయ్." అమితానందంగా అవులిస్తూ బూరుగుదూది పరుపు మీదికి వాలాడు.

కొబ్బరినూనె తెచ్చి అతని అరికాళ్ళకి రాసి అతి మెత్తగా మర్దనా చేసింది. గాఢమైన నిద్రలోకి వెళ్ళేవరకూ నొక్కుతూనే వుంది అతని కాళ్ళు. మూడు గంటలు కావొస్తోంది. ఒళ్ళు విరుచుకుంటూ లేచిన జయరామారావుకు ఎదురుగా వేడి టీ గ్లాసు పట్టుకు నిలబడింది కమలమ్మ. మళ్ళీ స్నానం చేసినట్టుంది. మరో పట్టుచీర కట్టుకుని అందంగా జడ అల్లుకుని, జడపాయలో గులాబీమొగ్గ గుచ్చుకు నిలబడి వుంది. రెప్పార్పకుండా ఆమెనే చూస్తూ టీ గ్లాసు అందుకు తాగుతున్న అతన్నడిగింది. "కపాలేశ్వరుడి గుడికి వెళదాం వస్తారా?"

"అలాగే పద."

"వేణ్ణీళ్ళు పెట్టాను. స్నానం చేసేసి పట్టుబట్ట లేసుకోండి."

"అలాగే" అని లేచిన అతని భుజం మీద తెల్లటి టవల్ వేసి పంపించింది బాత్‌రూమ్‌లోకి.

ఒళ్ళంతా సబ్బు రాసుకుని రుద్దుకుంటుండగా తలుపు తోసుకొచ్చిన ఆమె "వీపు రుద్దమంటారేమిటి?" అంది. "నా మతిమరుపుమండ. పొద్దుటే సున్నిపిండితో నలుగు పెట్టాల్సింది" అని సణుక్కుంటుంటే వెనక్కి తిరిగి ఆమెని చూసిన అతను విస్తుపోయాడు. కింద అంచు తడుస్తుందేమోనని కాస్త పైకి లాగి బొడ్లోకి దోపుకున్న ఆమె మెత్తగా అతని వీపు రుద్దుతూ, "మా ఊరి చెరువవుతుంది మీ వీపు. ఊఁ ఇక నీళ్ళు పోసేసుకొచ్చెయ్యం"డని వెళ్ళిపోయింది.

గుడిలో ఈశ్వరుని ముందు నిలబడ్డ ఇద్దరికేసి చూసిన ముసలిపూజారి పేరూ, నక్షత్రం చెప్పండన్నాడు.

క్షణం తడుముకోకుండా అతని పేరూ, నక్షత్రం చెప్పేసరికి ఈమెకెలా తెలుసా అని ఖంగుతింటూ నిలబడి పోయాడు జయరామారావు. అర్చన పూర్తయ్యాక గుడి ప్రాంగణంలో కొచ్చి చతికిలబడ్డారు. ప్రసాదంగా ఆ పూజారి ఇచ్చిన కొబ్బరిచిప్ప బద్దలుకొట్టి, విరిచిన కొబ్బరిముక్క అతని నోట్లోపెట్టి, కుంకుమతీసి అతని నొసటన అద్దింది.

గుడి శిఖరానికి కట్టిన స్పీకర్లోంచి చక్రవాకరాగంలో సుధా రఘునాథన్ పాడిన పిబరే రామరసం వినిపిస్తూంది. చల్లటి గాలి గుడి ప్రాంగణమంతా సుళ్ళు తిరుగుతూంది. వివరించలేని, వర్ణించలేని వింత అనుభూతి లోకాల్లో విహరిస్తోన్న జయరామారావును మెత్తగా తట్టి లేపిన కమలమ్మ "మరి బయల్దేరదామా?" అంది.

"అలాగే!" అని లేస్తూండగా చిన్న మల్లెపూల బుట్టతో ఎదురైన పదేళ్ళ పిల్ల, "ఇప్పుడే కోసుకొచ్చిన పూలు. బోణీ బేరం మీదే. మూర అర్థరూపాయికిస్తాను. కొని అమ్మగారి తలలో పెట్టండి" అని బతిమాలేసరికి రెండు మూరలు కొన్న జయరామారావు అందమైన ఆమె జడలో పాయ తీసి తురిమాడు. గుడి దాటి బయటకొస్తుంటే రోడ్డుకి రెండు పక్కలా వున్న దుకాణాలకేసి చూసి "ఏవన్నా కావాలంటే కొనుక్కో!" అన్నాడు.

"ఏం వద్దులెండి" అంది.

"నీ అందమైన చేతులకి మట్టి గాజులు బాగుంటాయి" అంటూ వద్దన్నా వినకుండా ఎరుపూ, పచ్చా, పసుపూ కలిపిన డజను గాజులు కొని స్వయంగా ఆమె చేతులకి తొడిగాడు. గాజుల చేతులు గలగల్లాడిస్తూ నడుస్తున్న కమలమ్మని, "ఇంకా ఏమన్నా కావాలా?" అని అడిగాడు.

"ఖర్చు దండగ పదండి" అని మెత్తగా కసిరి ముందుకు నడిచింది.

ఇంటికొచ్చారు. కాళ్ళు కడుక్కోడానికి బాత్‌రూమ్‌లో కెళ్ళబోతున్న అతన్నాపి, "గుడికెళ్ళొచ్చిన వెంటనే కాళ్ళు కడుక్కోకూడదట" అంది.

ఇంతకుముందు తెలీని విషయాన్ని ఇప్పుడే తెల్సుకున్న అతను బట్టలు మార్చు కుందామని తన బెడ్‌రూమ్‌లోకెళ్ళాడు.

వంటగదిలో కెళ్ళిన ఆమె బంగాళాదుంపలు చెక్కి, ముక్కలుకోసి, దోరగా వేయించి వేపుడు చేసింది. నిమ్మరసం చారు కాచింది. ఇంకా టెంక కట్టని మామిడిపిందెలుంటే తీసి జీడిబద్దలు చేసింది.

## 4

సాయంత్రం ఆరుగంటలయింది. గాలి చల్లగా వీస్తూంది. వీధిలో దీపాలూ, ఇళ్ళలో దీపాలూ వెలుగుతున్నాయి. తన స్టడీ రూమ్‌లో కూర్చుని సీరియస్‌గా రాసుకుంటున్న జయరామారావు "బాబుగారూ" అన్న గొంతు విని తలెత్తి చూశాడు.

బొట్టులేని ముఖంతో, తెల్లటి వాయిల్ చీర కట్టుకుని నిలబడివున్న కమలమ్మని చూసి మతి చలించినవాడిలా లేచాడు. తలొంచుకుని నిలబడ్డ ఆమె అంది- "ఆరు గంటలయింది, తమరు పెట్టిన గడువు పూర్తయింది. మరి శలవిప్పిస్తే వెళతాను."

తాను నిలబడ్డ భూమి కంపించినట్టు కదిలిపోయిన అతనికి అప్పుడు గుర్తొచ్చింది. ఆమె తన భార్యగా వుండేది కేవలం ఉదయం ఆరుగంటల్నుంచి సాయంత్రం ఆరుగంటలదాకానే అన్న సంగతి. బాధలన్నీ మరిచిపోయి, ఆమె తన జీవం, తన జీవన రాజీవం అన్నది భ్రమని అప్పుడే తెలిసింది. అతని గుండెలు ఇందాకటి గుళ్ళో మోగిన గంటలకంటే వేగంగా కొట్టుకుంటున్నాయి. చేతులూ, కాళ్ళూ కంపిస్తున్నాయి. స్వేదంతో నిండి పోయింది శరీరం. తడబడ్తున్న అడుగు లేసుకుంటూ ఆమె దగ్గరకొచ్చి నిలబడ్డాడు. జీవితంలో మొట్టమొదటిసారి అతని కళ్ళు నీళ్ళతో నిండుకుంటున్నాయి. నెమ్మదిగా తలెత్తి అన్నాడు. "నా కోరిక మన్నించి కొన్ని గంటలపాటు భార్యగా నాతో జీవితం పంచుకున్నావు. కానీ గడవబోయే ఆ కాస్త కాలం మధురంగా వుంటుందని వూహించుకున్నాగానీ, ఇంత సుమధురంగా వుంటుందని, స్వర్గం సరిహద్దుల్లో గడిపినట్టు వుంటుందని నాకు తెలీదు. భార్య భర్తని ఇంత అద్భుతంగా లాలించి పరిపాలిస్తుందని నాకు తెలీదు. నువ్వింత గొప్ప ఇల్లాలివని మచ్చుకయినా తెలీదు గాక తెలీదు.

అదిగాని ముందు తెలిసుంటే జీవితాంతం నా భార్యగా వుండిపొమ్మని ప్రాధేయపడేవాణ్ణి. కాదని నువ్వు తోసేస్తే నీ కాళ్ళు పట్టుకుని ప్రార్థించే వాణ్ణి. ఇలా చూడు- మనిద్దరివీ ఒకే రకమైన అభిరుచులు, ఒకే రకమైన ఆలోచనలు, ఒకే రకమైన ఇష్టాలు. అలాంటి ఇష్టమైన నన్ను ఇలా విడిచివెళ్ళడం న్యాయమైతే వెళ్ళు."

ఒక్క అడుగు కూడా వెనక్కి వెయ్యలేకపోయిన కమలమ్మ శబ్దం రాకుండా ఏడుస్తోంది. వెక్కివెక్కి ఏడుస్తోంది.

"ఇలా చూడు. భర్తను పోగొట్టుకున్న ఒంటరి ఆడదానివి నువ్వు. భార్య వుండి కూడా లేని ఒంటరివాణ్ణి నేను. ఏ జీవితాన్నయితే వూహించుకున్నానో, కోరుకున్నానో దాన్ని ఇన్నాళ్ళకి నీ రూపంలో ప్రసాదించాడు ఆ ఈశ్వరుడు. కాదనకు నన్ను."

"అన్నీ తెలిసి అమ్మగారికి అన్యాయం చెయ్యలేను, బాబూ!"

"ఆమె నాకు అన్యాయం చేస్తుంటే, నువ్వు న్యాయం చెయ్యడాని కొచ్చావు. చాలా చదువుకున్నవాడ్ని చెప్తున్నాను. నువ్వు ఏ అమ్మగారికీ ఏ అన్యాయం చెయ్యడంలేదు".

"మొన్న ఫోన్‌లో మీరు మాట్లాడ్తుంటే విన్నాను. ఆమెని మీరు ఏలుకుంటేనే వాళ్ళ పుట్టింటాళ్లు మీకు మూడు లక్షలూ ఇస్తారు. ఆ డబ్బే లేకపోతే ఈ వూళ్ళో మీరు చాలా అన్యాయ మయిపోతారు."

"ఆ డబ్బు తీసుకుని ఆమెని ఏలుకోలేను. ఏ రుచీ పచీ లేని బతుకు ఇక బతకలేను. నీలాంటి స్త్రీ భార్యగా పక్కనుంటే కొండంత మనోబలం వస్తుంది నాకు. ఆ బలంతో కొండల్ని పిండి చేస్తాను. పిండిని కొండగా మలుస్తాను. దయచేసి కాదనకు. నీ కాళ్ళు పట్టుకుని ప్రార్థిస్తాను, కాదనకు కమలమ్మా!"

ధారలుగా కారుతున్నాయి ఆమె కళ్ళలోంచి వస్తున్న నీళ్ళు. 'ఔను' అని ఈ జన్మకి అనలేని కమలమ్మ వెళ్ళిపోతూంది.

అది చూసిన జయరామారావు "అంతేనా? న్యాయమేనా? ఈ ఆకుపచ్చని జ్ఞాపకం మాత్రమే నాకు మిగులుస్తావా?" అంటూ ఉద్వేగంగా అరిచాడు.

వెళుతున్న ఆమె ఆగింది. నెమ్మదిగా వెనక్కి తిరిగి, "నా జన్మకు కూడా మిగిలింది ఈ ఒక్క జ్ఞాపకమే బాబూ!" అని కదిలింది.

రేవుదాటిన గూటిపడవలా నెమ్మదిగా నిష్క్రమించిన ఆ కమలమ్మ జీవితంలో మళ్ళీ ఎప్పుడూ కనిపించలేదు అతనికి.

★★★

('ఇండియా టుడే, ఆగస్ట్ 1997)✳